సాక్షి
అనంతపురం
గురువారం । 14 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.33,190

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33,190 పలికాయి.



టమాట కిలో రూ.20

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.2°/21.3°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు



అనంతపురం అగ్రికల్చర్: రబీలో వేరుశనగ సాగు చేసే రైతులు రాయితీ విత్తనాల కోసం ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లను కలిసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. నీటి వసతి కలిగిన రైతులు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం తదితర వివరాలు సమర్పించి రాయితీ పోనూ తమ వాటా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. భూమి విస్తీర్ణం బట్టి ఒక్కో రైతుకు గరిష్టంగా మూడు బస్తాలు (90 కిలోలు) పంపిణీ చేస్తామని తెలిపారు. క్వింటా పూర్తి ధర రూ.9,600 కాగా 40 శాతం రూ.3,840 రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద రూ.5,760 ప్రకారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏపీ సీడ్స్ ద్వారా ఇప్పటికే మండలాలకు విత్తన సరఫరా మొదలైందన్నారు. రిజిస్ట్రేషన్లు కొనసాగిస్తూనే తగినంత సరఫరా కాగానే పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో 20 వేల హెక్టార్లలో వేరుశనగ సాగులోకి రావచ్చని అంచనా వేయగా, 6,770 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించినట్లు తెలిపారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం గుంతకల్లు డివిజన్ మీదుగా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ బుధవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 19, 26వ తేదీల్లో హైదరాబాద్ జంక్షన్ నుంచి మధ్యాహ్నం 12.00 గంటలకు బయలుదేరే రైలు (07135) మరుసటి రోజు సాయంత్రం 4.10 గంటలకు కొట్టాయం చేరుతుందన్నారు. 20, 27 తేదీల్లో కొట్టాయం నుంచి సాయంత్రం 6.10 గంటలకు బయలుదేరే రైలు (07136) మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు హైదరాబాద్‌కు చేరుతుందన్నారు. అలాగే ఈ నెల 16న ఉదయం 8.20 గంటలకు నాందేడ్ జంక్షన్ నుంచి బయలుదేరిన రైలు (07139) మరుసటి రోజు రాత్రి 10.20 గంటలకు కొల్లం రైల్వే స్టేషన్‌కు చేరుతుంది. ఈ నెల 18న మధ్య రాత్రి 2.30 గంటలకు కొల్లం నుంచి బయలుదేరిన రైలు (07140) మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్‌కు చేరుకుంటుంది. ఈ నెల 23, 30వ తేదీల్లో మధ్యాహ్నం 2.45 గంటలకు మౌల అలీ జంక్షన్ నుంచి బయలుదేరిన రైలు(07141) మరుసటి రోజు రాత్రి 10.30 గంటలకు కొల్లం రైల్వే స్టేషన్‌కు, తిరిగి ఈ నెల 25, డిసెంబర్ 2న కొల్లం రైల్వేస్టేషన్ నుంచి మధ్య రాత్రి 2.30 గంటలకు బయలుదేరిన రైలు (07142) మరుసటి రోజు మధ్యాహ్నం 1 గంటకు మౌల అలీ జంక్షన్‌కు చేరుతుంది. ఈ రైళ్లు సికింద్రాబాద్, బేగంపేట, లింగంపల్లి, శంకరపల్లి, వికారాబాద్, తాండూరు, శిరం, యాద్గిరి, కృష్ణ, రాయచూర్, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, గుత్తి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

కళకళలాడే పంట పొలాలు.. ఆహ్లాదకర వాతావరణం.. స్వచ్ఛమైన గాలితో ఆ గ్రామాలు అలరారేవి. అందరి దృష్టిని ఆకర్షించేవి. కానీ ఇదంతా ఒకప్పటి కథ. పరిశ్రమల కారణంగా ఇప్పుడు ఆ పల్లెల వ్యథ వర్ణనాతీతం. కాలుష్య భూతం కోరలు చాచి పంటపొలాలు దారుణంగా దెబ్బతింటున్నాయి. దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఘాటైన వాసన ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

పచ్చటి పల్లెల్లో కాలుష్య కుంపటి



నేమకల్లు సమీపంలో పంట పొలాలకు ఆనుకుని ఉన్న ఫ్యాక్టరీల నుంచి వెలువడుతున్న పొగ



కాలుష్యంతో దెబ్బతిన్న చిక్కుడు మొక్క

- పరిశ్రమల దెబ్బకు బొమ్మనహాళ్, డీ హీరేహాళ్ రైతుల కుదేలు
- పంటలపై తీవ్ర ప్రభావం
- రోగాలతో స్థానికుల సతమతం
- నామమాత్రపు సాయంతో దగా చేస్తున్న యాజమాన్యాలు
- స్పందించని అధికారులు

రాయదుర్గం/బొమ్మనహాళ్: రాయదుర్గం నియోజకవర్గంలోని డీ హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాలు ఖనిజ నిల్వలకు ప్రసిద్ధి. దీంతో పెద్ద సంఖ్యలో స్పాంజ్ ఐరన్ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. బొమ్మనహాళ్ మండలం నేమకల్లు, హిర్దేహాళ్ మధ్య చిన్న, పెద్ద పరిశ్రమలు సుమారు పదికి పైగా వెలిశాయి. పరిశ్రమలు ఏర్పాటైతే ఉపాధి లభించి జీవితాలు బాగుపడుతాయని ఆశించిన ఆ పల్లెవాసులు.. ఆ కంపెనీలే తమ పాలిట 'కర్మ'.. గారాలుగా మారుతాయని ఊహించలేకపోయారు.

భూములు నిస్సారం

స్పాంజ్ ఐరన్ పరిశ్రమల నుంచి వెలువడే దుమ్ము, ధూళి కణాలు సాగు భూములపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. డీ హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లో సుమారు 900 ఎకరాలు సారవంతం కోల్పోయాయి. సాగు చేసిన పంటలను నల్లపొగ కమ్మేస్తోంది. పత్తి, కంది, చిక్కుడు, మొక్కజొన్న, మిరప తదితర పంటలు చేతికందడం గగనమైంది. దిగుబడి వచ్చిన తర్వాత కూరగాయలు, పండ్లు నీటిలో కడిగితే కాని నాణ్యంగా ఉండటం లేదు. పరిశ్రమల దెబ్బకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఆంజనేయస్వామి పుణ్యక్షేత్రం మసిబారుతోంది.

జీవనానికే ముప్పు..!

కాలుష్య కాటుతో ప్రజలు కూడా ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రోగాల బారిన పడుతున్నారు. చాలా మంది ఆస్తమాతో ఇబ్బంది పడుతున్నారు. పరిశ్రమల దెబ్బకు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని, ఆనందంగా జీవించే పరిస్థితులు కనిపించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యాజమాన్యాల దగా..

స్పాంజ్ ఐరన్ పరిశ్రమలు ఏర్పాటై 20 ఏళ్లు కావస్తోంది. అప్పట్లో చేసుకున్న ఒప్పందం మేరకే నేటికీ ఎకరాకు రూ.1,800 నుంచి రూ.2 వేల మేర సాయం అందుతోంది. ధరలు పెరుగుతున్నా పరిహారంలో మాత్రం మార్పు కనిపించడం లేదు. ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలంటూ ఇటీవల వామపక్షాలు, రైతు సంఘాలు ఆందోళన చేపట్టగా.. నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చిన పరిశ్రమల యాజమాన్యాలు కొన్ని రోజులకే ఆ విషయం మరచిపోయాయి.

కంకర క్వారీలతోనూ ఇబ్బంది

నేమకల్లు పరిసరాల్లో సుమారు 19 కంకర క్వారీలు, 12 స్టోన్ క్రషర్లు ఉన్నాయి. తవ్వకాలు జరిపేందుకు వాడే రసాయనాలు, బ్లాస్టింగ్ శబ్దానికి భారీగా కాలుష్యం వెలువడి మేకలు, గొర్రెలు, పశువులు, ఇతర జీవాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కొందరు రైతులు పదేళ్ల క్రితం జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు వెళ్లగా.. సీరియస్‌గా పరిగణించిన ట్రిబ్యునల్ సభ్యులు అప్పట్లో క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. 17 క్వారీలు, క్రషర్ల యూనిట్లను మూసివేయించారు. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ తవ్వకాలు మొదలైనట్లు తెలిసింది. ఇటీవల అధికార పార్టీ నాయకుడికి చెందిన ఓ కంకర టిప్పర్ మైనింగ్ అధికారులకు పట్టుబడింది.

పంటలు కోల్పోతున్నాం



స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే కాలుష్యంతో పంటలు కోల్పోతున్నాం. దుమ్ము, ధూళి పంటలపై పడి దిగుబడి రావడం లేదు. కాలుష్యంతో నల్లగా మారిన గ్రాసాన్ని పశువులు తినడం లేదు. పొలాల్లో పనిచేయడానికి కూలీలు రావడం లేదు.

– హనుమంతరెడ్డి, రైతు, నేమకల్లు

న్యాయం చేయాలి



కాలుష్యం వల్ల పంటలు బూడిద రంగులోకి మారి ఎండిపోతున్నాయి. దీంతో అప్పుల పాలయ్యాం. అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. బొమ్మనహాళ్ తహసీల్దార్ కార్యాలయం, అనంతపురం కలెక్టర్ కార్యాలయాన్ని కూడా ముట్టడించాం. ఇప్పటికైనా నా న్యాయం చేయాలి.

– రామాంజినేయులు, రైతు, నేమకల్లు

ప్రతి సారీ నష్టాలే



ఐదెకరాల్లో పత్తి, కంది పంటలను సాగు చేస్తున్నా. ఎకరాకు రూ. 30 వేల పెట్టుబడి పెడుతున్నా. ఫ్యాక్టరీల నుంచి వచ్చే పొగ కారణంగా దిగుబడి పూర్తిగా తగ్గిపోయి ఎకరాకు 3 క్వింటాళ్లు కూడా రావడం లేదు. పత్తి పంట నల్లగా మారుతుండటంతో మార్కెట్‌లోనూ ధర తగ్గించేస్తున్నారు.

– వసికేరప్ప, రైతు, నేమకల్లు

చర్యలు తీసుకుంటాం



కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తాం. స్పాంజ్ ఐరన్ పరిశ్రమల వల్ల తలెత్తే ఇబ్బందులపై అగ్రికల్చర్, హార్టికల్చర్, రెవెన్యూ అధికారులతో విచారణ చేయిస్తున్నాం. పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం.

– వసంతబాబు, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

పేదల ఆర్థికాభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: పేదల ఆర్థికాభివృద్ధికి సహకరించాలని బ్యాంకర్లకు కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో బుధవారం బ్యాంక్ మెగా రుణ మేళా–2024 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. అర్హులైన పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల లబ్ధి చేకూర్చడం అందరి బాధ్యత అన్నారు. రుణాల మంజూరు అంశంపై బ్యాంకులపై ప్రజలకున్న అపోహలను తొలగించేందుకు మెగా రుణ మేళా నిర్వహించామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు వందశాతం పూర్తి చేయాలన్నారు. డిమాండ్ ఉన్న కొన్ని పథకాల లక్ష్యాన్ని మరింత పెంచుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలోకి వెళ్లి పథకాలకు అర్హులైన వారిని గుర్తించి లబ్ధి చేకూర్చాలన్నారు. అనంతరం వివిధ పథకాలకు సంబంధించి రుణ వితరణ పత్రాలను లబ్ధిదారులకు కలెక్టర్ అందజేశారు. కార్యక్రమం ముగింపులో ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం నర్సింగరావు, పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్, ఉద్యానశాఖ డీడీ నరసింహారావు, చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి, బ్యాంకర్లు, పారిశ్రామికవేత్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలు నిర్వహించాలి

విద్యార్థుల అపార్ జనరేషన్‌కు అనువుగా పాఠశాలల్లోనే ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.విజయభాస్కర్ కోరారు. ఈ మేరకు కలెక్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదు కోసం విద్యార్థి పాఠశాల రికార్డులు, యు-డైస్‌లో వివరాలు ఒకటే ఉన్నప్పటికీ ఆధార్‌లోని వివరాలు మరో విధంగా ఉండడంతో సమస్య వస్తోందన్నారు. ఈ కారణంగా అపార్ నమోదు చేయలేక ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామస్థాయిలో తగినన్ని ఆధార్ కేంద్రాలు లేనందున విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. చాలా పాఠశాలల్లో 60 శాతం మంది విద్యార్థుల ఆధార్‌లో వివరాలు సరిగ్గా లేవన్నారు. పాఠశాలల్లో ఆధార్ కేంద్రం నిర్వహించడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చునని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కనకదాస జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించాలి

భక్త కనకదాస జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. కార్యక్రమం నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో అధికారులతో ఆయన సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కనకదాస జయంతిని రాష్ట్ర పండగగా ఈ నెల 18న నిర్వహించనున్నామన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. నిర్వహణ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. స్థానిక గుత్తి రోడ్డు సర్కిల్‌లో ఉన్న కనకదాస విగ్రహ ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. కార్యక్రమం రోజున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ రమణమూర్తి, బీసీ సంక్షేమశాఖ డీడీ ఖుష్బూ కోఠారి, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, నగర పాలక సంస్థ కమిషనర్ నాగరాజు, డీసీఓ అరుణకుమారి, జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, తహసీల్దారు హరికుమార్, డీపీఆర్‌ఓ గురుస్వామిశెట్టి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంట నష్టం వివరాలు పంపండి

- వ్యవసాయ కమిషనరేట్ ఉత్తర్వులు
- గరిష్టంగా రెండు హెక్టార్లకు 'ఇన్‌పుట్'
- 46 మండలాల రైతులకు సబ్సిడీ నిల్

అనంతపురం అగ్రికల్చర్: కరువు జాబితాలో ప్రకటించిన మండలాల్లో పంటల నష్టంపై జాబితా రూపొందించి పంపాలని వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి జిల్లా అధికారులకు బుధవారం ఉత్తర్వులు అందాయి. జిల్లాలో అనంతపురం, నార్పల, విడపనకల్లు, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు కరువు మండలాల జాబితాలో ఉండగా, శ్రీ సత్యసాయి జిల్లాలో తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల, కనగానపల్లి, ధర్మవరం, ఎన్‌పీ కుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి మండలాలను ప్రకటించారు. మిగిలిన 46 మండలాలు కరువు జాబితాలో చేర్చలేదు.

గరిష్టంగా రెండు హెక్టార్లకు..

కరువు మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో రైతులకు ఇన్‌పుట్‌సబ్సిడీ (పెట్టుబడిసాయం) ఇవ్వడానికి వీలుగా స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్‌డీఆర్‌ఎఫ్), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్‌డీఆర్‌ఎఫ్) నిబంధనల మేరకు పంట నష్టం అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. 33 శాతం అధికంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసి.. ప్రతి రైతుకూ గరిష్టంగా రెండు హెక్టార్లకు పరిగణలోకి తీసుకుని సమగ్ర వివరాలతో కూడిన 33 కాలమ్స్ ఫార్మాట్ సిద్ధం చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు, ఏవోలు, ఏడీఏలతో కూడిన గ్రామ, మండల, సబ్ డివిజినల్ బృందాలతో పంట నష్టం జాబితా తయారు చేయాలని ఆదేశించారు. ఈనెల 20 నుంచి 25 తేదీల మధ్య ఆర్‌ఎస్‌కేల్లో జాబితాను ప్రదర్శించాలని, పొరపాట్లు, తప్పిదాలు ఉంటే అభ్యంతరాలు స్వీకరించి అవసరమైతే సవరణ చేయాలని సూచించారు. తుది జాబితా ఈనెల 28న ప్రభుత్వానికి అందజేయాలని పేర్కొన్నారు. ఎక్కడా డబుల్ ఎంట్రీలు, పొరపాట్లు లేకుండా చూసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఉపశమనం ఇలా..

పంటనష్టం ఉపశమనం కింద (స్కేల్ ఆఫ్ రిలీఫ్) కింద వేరుశనగ, పత్తి, వరి, మిరప, కూరగాయలు, ఉల్లి, పూలు, బొప్పాయి, కళింగర, కర్బూజా పంటలకు హెక్టారుకు రూ.17 వేల ప్రకారం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. మొక్కజొన్న హెక్టారుకు రూ.12,500, కంది, మినుము, పెసలు, అలసంద లాంటి పప్పుదినుసు పంటలకు హెక్టారుకు రూ.10 వేలు, జొన్న, సజ్జ, రాగి, కొర్ర, ఆముదం పంటలు హెక్టారుకు రూ.8,500 ప్రకారం ఒక్కో రైతుకు గరిష్టంగా 2 హెక్టార్లకు పరిహారం అందేలా జాబితాలు సమగ్రంగా తయారు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. వ్యవసాయశాఖ అధికారులు జాబితాలను రూపొందించడంపై దృష్టి సారించారు.

పోలీసుల అదుపులో సోషల్ మీడియా యాక్టివిస్టు

- మఫ్టీలో వచ్చి తీసుకెళ్లిన పోలీసులు
- విచారణ పేరుతో కాలయాపన
- స్టేషన్ వద్దే తండ్రి పడిగాపులు
- ఎక్కడికి తీసుకెళ్లారో తెలియడం లేదని ఆందోళన



ప్రసాద్‌రెడ్డి (ఫైల్)

రాయదుర్గం: సోషల్ మీడియా యాక్టివిస్టులపై ప్రభుత్వ వేధింపులు కొనసాగుతున్నాయి. తాజాగా బుధవారం రాయదుర్గం మండలం ఆయతపల్లికి చెందిన ప్రసాద్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురు మఫ్టీలో వెళ్లి ఇంట్లో ఉన్న ప్రసాద్‌రెడ్డిని చుట్టుముట్టారు. సీఐ పిలుస్తున్నారంటూ పోలీస్‌స్టేషన్‌కు రమ్మన్నారు. కారణం చెప్పాలని కుటుంబ సభ్యులు పట్టుబట్టినా ఏమీ చెప్పకుండా ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని రాయదుర్గం అర్బన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. దీంతో తండ్రి బ్రహ్మానందరెడ్డి అర్బన్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. తన కుమారుణ్ని ఎందుకు తీసుకొచ్చారో చెప్పాలంటూ పోలీసులను వేడుకున్నాడు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో విచారిస్తున్నామని, విచారణ తర్వాత పంపిస్తామని చెప్పారు. అయితే అతన్ని చూపడానికి నిరాకరించారు. తన కుమారుణ్ని ఇక్కడే ఉంచారా ? లేక మరెక్కడికైనా తీసుకెళ్లారో అర్థం కావడం లేదని తండ్రి ఆందోళన వ్యక్తం చేశాడు. నెల క్రితమే కుమారుడి వివాహమైందని, కోడలు లావణ్య, తల్లి ఉమాదేవి కన్నీటి పర్యంతం అవుతున్నారని తెలిపాడు. తన కుమారుణ్ని వదిలే వరకు ఇక్కడే ఉంటానని చెప్పాడు. ఈ విషయంపై సీఐ జయనాయక్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టడంతో విచారిస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులా?

విచారణ పేరుతో సోషల్‌మీడియా యాక్టివిస్టులను అదుపులోకి తీసుకోవడం, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం తగదని వైఎస్సార్‌సీపీ రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి అన్నారు. ప్రసాద్‌రెడ్డిని అదుపులోకి తీసుకోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారన్నారు. సీఐకు ఫోన్ చేస్తే రాత్రి తొమ్మిది గంటల తర్వాత పంపిస్తామని చెప్పారన్నారు. ప్రభుత్వ ఒత్తిడి మేరకు అమాయకులను కేసుల్లో ఇరికించాలని చూస్తే సీరియస్‌గా పరిగణించాల్సి వస్తుందని హెచ్చరించారు.

ప్రీమియం చెల్లించాలి

అనంతపురం అర్బన్: రైతులు తమ వాటా పంటల బీమా ప్రీమియం వెంటనే చెల్లించి నమోదు చేసుకోవాలని జేసీ శివ నారాయణ శర్మ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ, అనుబంధ శాఖలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి డిసెంబరు 15వ తేదీలోగా రైతులు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని మార్కెటింగ్ శాఖ ఏడీకి సూచించారు. ఎరువులకు రైతుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని ఏపీ మార్క్‌ఫెడ్‌కు చెల్లించేలా చూడాలన్నారు.

బాలలు... ప్రతిభావంతులు

సందర్భం నేడు బాలల దినోత్సవం

పిల్లలే.. కానీ, తమకంటే వయసులో పెద్దవారి కంటే గొప్ప విజయాలు సాధించారు. బడికెళ్లే వయసులోనే వీళ్లు తమ ఆలోచనలకు పదునుపెట్టారు. అనూహ్యమైన విజయాలను సొంతం చేసుకుంటున్నారు. అలాంటి చిన్నారుల్లో ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పే బాలల దినోత్సవం రానే వచ్చింది. ఏటా నవంబర్ 14న దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో గురువారం చాచా నెహ్రూ జయంతిని చిన్నారుల సృజన నడుమ ఘనంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో చిరుప్రాయంలోనే అనూహ్యమైన విజయాలను సొంతం చేసుకున్న చిన్నారుల్లోని ప్రతిభపై 'సాక్షి' కథనం.

– అనంతపురం కల్చరల్

చదరంగంలో చిచ్చరపిడుగు



అనంతపురం నగరానికి చెందిన కీర్తి, కాశి రవీంద్ర దంపతుల కుమార్తె శమిక... ఏడేళ్ల ప్రాయంలోనే చెస్‌లో రాణిస్తోంది. ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్జాతీయ చెస్ పోటీల్లో మూడు దేశాలకు చెందిన 508 మంది క్రీడాకారులు క్లాసికల్ విభాగంలో, 528 మంది క్రీడాకారులు ర్యాపిడ్ విభాగంలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న శమిక... క్లాసికల్ విభాగంలో ఐదో స్థానం, ర్యాపిడ్ విభాగంలో 4వ స్థానం దక్కించుకుని ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్‌లో 1300 ర్యాంకును కైవసం చేసుకుంది. అలాగే బ్లిట్జ్ విభాగంలో రెండో స్థానం దక్కించుకుంది.

స్కిట్లతో అదరగొట్టేస్తూ..



అనంతపురానికి చెందిన విశ్వనాథ్, గౌరీ దంపతుల కుమార్తెలు నాషిత, హనీష... స్కిట్లతో అదరగొడుతున్నారు. వీరిలో ఒకరు 1వ తరగతి కాగా, మరొకరు మూడో తరగతి చదువుతున్నారు. చిరుప్రాయంలోనే సామాజిక మాధ్యమాల వేదికగా వీరు ఇప్పటి వరకూ పదికి పైగా స్కిట్లను ప్రదర్శించి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. మల్టీ టాలెంటెడ్ కత్తి విజయ్‌కుమార్‌తో కలసి 'నా వంద గోవింద', 'నాకు స్కూల్ నచ్చడం లేదు', 'నాకు మొబైల్ అంటే ఇష్టం' స్కిట్లు వీరి ప్రతిభను చాటాయి.

కేక పెట్టించే డ్యాన్స్



అనంతపురానికి చెందిన లక్ష్మీకాంత్, సులోచన దంపతుల కుమారుడు ద్వారకసాయి... స్థానిక ఓ కార్పొరేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. మూడేళ్ల ప్రాయం నుంచే ఫోక్, వెస్టర్న్ డ్యాన్సుల్లో రాణిస్తూ గుంటూరు, తిరుపతి, విజయవాడ, హైదరాబాదులో జరిగిన పోటీల్లో పాల్గొని బహుమతులందుకున్నాడు. 2023లో తిరుపతిలో జరిగిన జాతీయస్థాయి నాట్య పోటీల్లో బంగారు పతకాన్ని దక్కించుకున్నాడు. 2024లో చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి డ్యాన్సు స్పోర్ట్స్‌లో మరోసారి ప్రథమ స్థానంలో నిలిచాడు.

'గగన'మే హద్దుగా



అనంతపురం నగరానికి చెందిన భార్గవి, భరణీకార్తీక్ దంపతుల కుమార్తె గగన అన్విక... నాల్గో తరగతి చదువుతోంది. అనంతపురంలోని నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్ వద్ద కూచిపూడి అభ్యసిస్తోంది. పట్టుమని పదేళ్ల వయసు కూడా దాటకనే జాతీయ స్థాయిలో 30 అవార్డులను సొంతం చేసుకుంది. నాగపూర్‌లో జరిగిన జాతీయ డ్యాన్సు ఒలంపిక్స్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని దక్కించుకున్న గగన... అనంతరం ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాదు తదితర వేదికలపై నృత్య ప్రదర్శనలతో పలువురిని ఆకట్టుకుంది.

స్కేటింగ్‌లో మెరుపు



అనంతపురం నగరానికి చెందిన హంజా హుస్సేన్ కేవలం ఏడేళ్ల ప్రాయంలోనే స్కేటింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు. ఇటీవల కాకినాడలో జరిగిన 36వ అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏకంగా రెండు బంగారు పతకాలు దక్కించుకున్నాడు. రోలర్ స్కేటింగ్, రోడ్ రేస్ విభాగంలోనూ సత్తా చాటుతున్నాడు.

క్లుప్తంగా

బ్లాక్‌స్పాట్ల పరిశీలన

అనంతపురం: జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్లను ఆయా ప్రాంతాల పోలీసు అధికారులు బుధవారం పరిశీలించారు. ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. ప్రమాదాలు జరగకుండా ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలను గుర్తించారు. సైన్ బోర్డులు, కాషన్ బోర్డులు, రోడ్ బేరియర్స్, స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్, క్యాట్ ఐస్, బ్లింకింగ్ స్టడ్స్, కన్వెక్స్ మిర్రర్.. వీటిలో ఏవి అవసరమో గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ఆర్థిక సాయం అందజేత

అనంతపురం: ఉమ్మడి జిల్లాలోని పలు పీఎస్‌ల్లో పని చేసి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు ఎస్.ఆంజనేయులు కుటుంబానికి రూ.4.32 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మొత్తాన్ని చెక్కురూపంలో మృతుడి భార్య జయలక్ష్మికి బుధవారం ఎస్పీ పి. జగదీష్ అందజేశారు. ఉమ్మడి జిల్లాలోని హోంగార్డులు ఒక రోజు తమ గౌరవ వేతనాన్ని అందజేయడాన్ని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి, ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, ఇన్‌స్పెక్టర్ మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

అనంతపురం అర్బన్: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలంటూ 104 ఉద్యోగులు బుధవారం అనంతపురంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. 104 మొబైల్ మెడికల్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్ మాట్లాడుతూ.. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో 16 ఏళ్లుగా వైద్యారోగ్యశాఖ పరిధిలో 104 ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో బతుకుతున్న వీరి సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, సురేష్, కిషోర్, మహబూబ్‌బాషా,తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబుకు ఏపీటీఎఫ్ నాయకులు విన్నవించారు. బుధవారం ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి ఆధ్వర్యంలో డీఈఓ ప్రసాద్‌బాబును నాయకులు కలిశారు. ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. విద్యారంగ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. డీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు నరేష్, గురురాజు, సాంబశివారెడ్డి, సూర్యనారాయణ, లక్ష్మన్న, తదితరులు ఉన్నారు.

ప్రతిష్టాత్మకంగా సంతోష్ ట్రోఫీ

అనంతపురం: ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్‌లో సంతోష్ ట్రోఫీని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్, ఆర్డీటీ వివిధ శాఖల అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ సమీక్ష చేశారు. సంతోష్ ట్రోఫీకి జిల్లా యంత్రాంగం తరఫున సంపూర్ణ సహకారం అందించాలన్నారు. ఫైర్ సేఫ్టీ, డిజాస్టర్ రెస్పాన్స్ మెకానిజం పాటించాలన్నారు.

తగ్గని తెలుగు తమ్ముళ్లు

- ఉరవకొండ టీడీపీ చోటా నాయకుల బరితెగింపు
- డీఈఓ కార్యాలయానికే వచ్చి వార్నింగ్
- 'అన్న' లెటరిచ్చినా పట్టదా అంటూ సమగ్ర శిక్ష ఏపీసీ, డీఈఓలపై చిందులు



అనంతపురం ఎడ్యుకేషన్: ఉరవకొండ మోడల్ స్కూల్‌లో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల్లో చేరకుండా మంత్రి పయ్యావుల కేశవ్ పేరు చెప్పి అడ్డుపడిన వైనంపై 'సాక్షి'లో బుధవారం 'మా వారిని కాదని ఎలా ఇస్తారు?' అనే శీర్షికతో కథనం వెలువడింది. అయినా పచ్చ పార్టీ నాయకులు ఏమాత్రమూ వెనక్కు తగ్గలేదు. అధికారం ఉందనే ధీమాతో ఏకంగా డీఈఓ కార్యాలయానికి వచ్చి సమగ్రశిక్ష ఏపీసీ నాగరాజు, డీఈఓ ప్రసాద్‌బాబుకు వార్నింగ్ ఇవ్వడం కలకలం రేపుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఉరవకొండ మండలం నుంచి టీడీపీకి చెందిన ఇద్దరు చోటా నాయకులు డీఈఓ కార్యాలయానికి వచ్చారు. సమగ్రశిక్ష ఏపీసీ నాగరాజుపై తీవ్రస్థాయిలో చిందులేశారు. మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం రాష్ట్ర కార్యాలయం నుంచే జాబితా తయారు చేసి పంపారని, ఆ మేరకే తాము చర్యలు తీసుకున్నామని ఏపీసీ చెబుతున్నా వినిపించుకోలేదు. 'ఈ విషయాన్ని ఆరోజు అన్న లెటర్ ఇచ్చిన సమయంలో ఎందుకు చెప్పలేదని' మండిపడ్డారు. 'ఆ రోజేమో చూస్తాం.. కచ్చితంగా చేస్తామని చెప్పి ఈరోజు రాష్ట్ర కార్యాలయం నుంచి జాబితా వచ్చిందంటారా?' అని చిందులేశారు. తామేమీ చేయలేమని ఏపీసీతో పాటు డీఈఓ తేల్చి చెప్పగా... టైప్–3,4 (వంట మనుషులు, వాచ్‌మన్లు) పోస్టులైనా తాము చెప్పిన వారికి ఇస్తారా ఇవ్వరా? అని గట్టిగా అడిగారు. ఇప్పటికే ఎవరెవరికి ఇవ్వాలో అన్న లెటర్‌పై పేర్లు ఇచ్చాం.. వారికి కాకుండా ఏ ఒక్కరికి వేరేవాళ్లకు ఇచ్చినా అక్కడ ఎలా పనిచేస్తారో చూస్తామంటూ హెచ్చరించి పోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధుల ఉదాసీన వైఖరికారణంగా చోటా నాయకులు ఎక్కడికెక్కడ రెచ్చిపోతూ అధికారులపై తిరగబడుతున్నారంటూ ఉద్యోగులు వాపోతున్నారు.

ఆ ఇద్దరు ఉద్యోగులకు పిలుపు

'సాక్షి'లో వచ్చిన కథనంతో అధికారులు అప్రమత్తమయ్యారు. విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో ఉరవకొండ మోడల్ స్కూల్‌లో వార్డెన్, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు ఎంపికైన వారిని వెంటనే విధుల్లో చేర్చుకోవాలని జిల్లా అధికారులు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. దీంతో ఆ ఇద్దరు ఉద్యోగులకు విధుల్లో చేరాలని చెప్పినట్లు తెలిసింది.

రెడ్‌క్రాస్ సేవలను విస్తృతం చేయాలి

అనంతపురం మెడికల్: రెడ్‌క్రాస్ సేవలను విస్తృతం చేసి పేద ప్రజలకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని పాతూరు సీడీ హాస్పిటల్ ఆవరణంలో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సీఎస్ఆర్ యాక్టివిటీ కింద అందించిన ప్లేట్‌లెట్ కాంపోనెంట్ సపరేటర్, 25 కిలో వోల్ట్స్ సోలార్ ప్యానెల్‌లను బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. రూ.30 లక్షలతో ప్లేట్‌లెట్ కాంపోనెంట్ సపరేటర్, రూ.16 లక్షలతో 25 కిలోఓల్ట్స్ సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేశారన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వాల్లో ముందంజలో ఉండటంతో రాష్ట్రస్థాయిలో అవార్డు వచ్చే అవకాశముందన్నారు. ఏపీ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు కాపు రామచంద్రారెడ్డి అఫెరిసిస్ మిషన్‌తో ఉపయోగాలు, రక్తదానం చేయడం ద్వారా కలిగే ఉపయోగాలను తెలియజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి మాట్లాడుతూ యువత రక్తదానం చేసేందుకు ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో డ్రగ్ కంట్రోల్ అథారిటీ అడిషనల్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ జేడీఎం హమంత్, తహసీల్దార్ హరికుమార్, డీఎంహెచ్ఓ కార్యాలయం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమజేమ్స్, తదితరులు పాల్గొన్నారు.



అఫెరిసిస్ పరికరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కాపు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

అనంతపురం ఎడ్యుకేషన్: టేబుల్ టెన్నిస్ (టీటీ) రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటిన నగరంలోని శ్రీసాయి విద్యానికేతన్ విద్యార్థిని రంగిశెట్టి మనస్విని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినిని అభినందించారు. విద్యానికేతన్ కరస్పాండెంట్ కుసుమ పుల్లారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 21 వరకు కేంద్ర పాలిత ప్రాంతం డామన్ డయ్యూలో జాతీయ స్థాయి పోటీలు జరుగుతాయన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

అనంతపురం: మద్యం దుకాణాలు, బార్లలో నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పేర్కొన్నారు. నగరంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మద్యం షాపుల వద్ద ఎమ్మార్పీ ధరల పట్టికను ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. ధాబాలు, హోటళ్లలో మద్యపానం జరగకూడదన్నారు. అనధికార మద్యం అమ్మకాలు జరపరాదన్నారు. అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలకు బుద్ధి చెప్పండి

అనంతపురం అర్బన్: ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వాల తీరును నాయకులు ఎండగడుతూ బుధవారం స్థానిక తపోవనం సర్కిల్, సోమనాథ్‌నగర్, యువజన కాలనీ, బళ్లారిరోడ్డు, తదితర కాలనీల్లో ఇంటింటికి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. నగర కమిటీ సభ్యులు రామిరెడ్డి, వెంకటనారాయణ ఉన్నారు.

'బోధనేతర' పనులు వద్దే వద్దు

అనంతపురం ఎడ్యుకేషన్: బోధనేతర పనుల నుంచి టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఉపాధ్యాయ భవనంలో బుధవారం జరిగిన ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వపు కార్యదర్శి నరసింహులు మాట్లాడారు. వివిధ రకాల యాప్‌లతో ఉపాధ్యాయులకు పనిభారం రోజురోజుకూ పెరిగిపోతోందన్నారు. దీంతో బోధనా అంశాలను సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా సబ్ కమిటీ సభ్యులు సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు నిబంధనలు ఉల్లంఘిస్తున్న పోలీసులు

- మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం ముందస్తు నోటీసులు జారీ చేయకుండా, అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని మేయర్ వసీం విమర్శించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్న విషయాన్ని పోలీసులు గుర్తించుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రశ్నించే హక్కును కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని తెలిపారు. ఎన్నికలకు ముందు అలివిగాని హామీలతో గద్దెనెక్కి 150 రోజులైనా అమలు చేయకపోవడం దారుణమన్నారు. బడ్జెట్‌లోనూ అరకొర కేటాయింపులు చేసి ప్రజలను మోసం చేశారన్నారు. సీఎం చంద్రబాబు వాగ్దానాలను అమలు చేయకుండా శ్రీవారి లడ్డూ, రుషికొండ, వరదలతో డైవర్షన్ పాలిటిక్స్ చేశారని, దీనిపై వైఎస్సార్ సీపీ సామాజిక కార్యకర్తలు గొంతెత్తితే వారిపై చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రానున్న రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారని ఆయన స్పష్టం చేశారు.




చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

అనంతపురం: నగరంలోని కృపానందనగర్‌లో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో చోటు చేసుకున్న చోరీ కేసును 48 గంటల్లోనే పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి రూ.15 లక్షల విలువైన 21 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను టూటౌన్ సీఐ శ్రీకాంత్, ఎస్ఐ రుష్యేంద్రబాబు బుధవారం వెల్లడించారు.

గత నెల చివరి వారంలో చోరీ

బాధిత టీచర్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఇద్దరు కుమారులూ హైదరాబాద్‌లో ఉంటున్నారు. కుమార్తె దివ్యాంగురాలు. మాటలు రావు. ఈ క్రమంలో ప్రస్తుతం అరవిందనగర్‌లో నివాసముంటున్న బిహార్‌కు చెందిన విజయ్‌కుమార్ సింగ్ (పచ్చబొట్లు వేస్తూ జీవనం సాగించేవాడు) టీచర్, ఆయన భార్యతో పరిచయం పెంచుకున్నాడు. తరచూ టీచర్ ఇంటికి వెళ్లి వారి కుమార్తెను ఆడిస్తూ సరదాగా గడిపేవాడు. టీచర్ భార్య బంగారు నగలను బీరువాలో కాకుండా స్టీల్ సామాన్లలోనే భద్రపరచడం గమనించిన విజయ్‌కుమార్‌సింగ్ గత నెల చివరి వారంలో ఆ బాక్స్‌ను గుట్టుచప్పుడు కాకుండా అపహరించుకెళ్లాడు. అయితే రెండు రోజుల క్రితం 21 తులాల బంగారు నగలు కనిపించని విషయాన్ని గుర్తించిన టీచర్ దంపతులు వెంటనే అనంతపురం టూటౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.



రికవరీ చేసిన బంగారాన్ని చూపుతున్న పోలీసులు

పక్కా ఆధారాలతో పట్టివేత

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చేంత వరకూ విజయ్‌కుమార్‌సింగ్‌పై టీచర్ దంపతులకు అనుమానం రాలేదు. అయితే ఇటీవల విజయ్‌కుమార్ సింగ్ శరీరంపై బంగారు నగలు వేసుకోవడం, ఓ ఫైనాన్స్ కంపెనీలో బంగారు తాకట్టు పెట్టడంతో అనుమానం వచ్చిన పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. తాను అపహరించిన బంగారు నగలను తన కుమార్తె కుమారి నైనా, గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన జెన్నే వన్నూరుస్వామితో కలసి ఓ ప్రైవేట్ బ్యాంకులో తాకట్టు పెట్టి డబ్బు తీసుకున్నట్లుగా అంగీకరించాడు. దీంతో ముగ్గురు నిందితులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి, 21 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

నేడు 'ప్రజాపోరు'

ఆత్మకూరు: సీపీఎం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద నిర్వహించే ప్రజాపోరును విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ప్రజాపోరు పోస్టర్లను ఆత్మకూరులో విడుదల చేశారు. ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని, డీఎస్సీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, మహిళలపై దాడులు అరికట్టాలని, నిత్యావసర సరుకుల ధరలు, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాము, రామయ్య, సువర్ణమ్మ, జయమ్మ, ఆవాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో అభివృద్ధి

ఆత్మకూరు: ప్రజల సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు నిర్వహించిన గ్రామ పంచాయతీ ప్రణాళిక శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, ఎంపీడీఓ లక్ష్మినరసింహ, వైస్ ఎంపీపీ విజయ్ కుమార్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు చేపట్టాలి

అనంతపురం ఎడ్యుకేషన్: నగర పాలక సంస్థ, మున్సిపల్ టీచర్ల పదోన్నతుల ప్రక్రియ వెంటనే చేపట్టాలని కూటమి సర్కార్‌ను రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని కార్పొరేషన్ స్కూళ్లల్లో ఎస్టీయూ 'సమస్యల సేకరణ–సభ్యత్వ నమోదు' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, మునిసిపల్ టీచర్ల రాష్ట్ర కమిటీ కన్వీనర్ ఫణిభూషణ్ మాట్లాడుతూ ఆలస్యం కాకుండా షెడ్యూలు ప్రకారం ఈ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. మొత్తం ఖాళీలను పదోన్నతులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఆర్జేఎంఏ చేపట్టిన పదోన్నతుల్లో ఆగిన రోస్టర్ నుంచి తిరిగి కొనసాగించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, సురేష్‌కుమార్, నాయకులు నరసింహులు, కృష్ణమూర్తినాయుడు, వేణుగోపాల్, నౌషాద్, రమేష్, మల్లికార్జున, వన్నూరప్ప పాల్గొన్నారు.

సబ్సిడీ బియ్యం పట్టివేత

రాప్తాడు: సబ్సిడీ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్‌డీఓ జ్యోతి తెలిపారు. కర్నూలు జిల్లా డోన్‌కు చెందిన దిలీప్... తాను సేకరించిన 261 క్వింటాళ్ల బియ్యాన్ని మౌలాల అనే వ్యక్తికి చెందిన లారీలో కర్ణాటకలోని కోలారు జిల్లా బంగారుపేటకు తరలిస్తూ బుధవారం రాప్తాడు మండలం మరూరు టోల్‌ప్లాజా వద్ద అధికారులకు పట్టుబడ్డారు. వీటికి సంబంధించి ఎలాంటి బిల్లులు, ఆధారాలు లేకపోవడంతో లారీని సీజ్ చేశారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని గుంతకల్లులోని స్టాక్ పాయింట్‌కు తరలించారు.

క్రీడాకారులకు అభినందన

అనంతపురం: క్రీడాకారులను డీఈఓ ప్రసాద్ బాబు, స్కూల్ గేమ్స్ సెక్రటరీ సుగుణమ్మ, ఏడీ నాగరాజు బుధవారం అభినందించారు. ఈ నెల మూడు, నాలుగో తేదీల్లో వైఎస్సార్ జిల్లా పులివెందులలో జరిగిన సాఫ్ట్ టెన్నిస్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన క్రీడాకారులు జ్ఞానేశ్వర రెడ్డి (లక్ష్మీ సినర్జీ స్కూల్), సంహిత (సెంట్రల్ స్కూల్ ఎస్కేయూ), కిరణ్మయి (రాజేంద్ర మునిసిపల్ హైస్కూల్) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మధ్యప్రదేశ్‌లో జరగబోయే జాతీయ స్థాయి సాఫ్ట్‌టెన్నిస్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు.

'సూపర్'గా చీటింగ్ చేశారు

అనంతపురం టవర్‌క్లాక్: టీడీపీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో చెప్పారని, ఇప్పుడు మాత్రం వాటిని విస్మరించి 'సూపర్'గా చీటింగ్ చేశారని కాంగ్రెస్ పార్టీ అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాదాగాంధీ విమర్శించారు. బుధవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్ అధికారంలో ఉన్నప్పుడు అన్ని పథకాలు అమలైతే.. నేడు కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలనూ మోసం చేస్తున్నారని విమర్శించారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ వెంటనే చేపట్టాలని, పీఏబీఆర్ కుడికాలువ ద్వారా 49 చెరువులకు నీరివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు గాజుల వాసు తదితరులు పాల్గొన్నారు.

అంకెల గారడీ బడ్జెట్

అనంతపురం అర్బన్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమం పేరుతో రాష్ట్ర బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు అంకెలగారడీ మాత్రమేనని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజినేయులు విమర్శించారు. బుధవారం స్థానిక సమాఖ్య కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. వెనుకబడిన, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలకు పెద్ద పీట వేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్న మాటలకు, ఆయన చేతలకు ఎంతో తేడా ఉందన్నారు. సమావేశంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, కార్య నిర్వాహక అధ్యక్షుడు సి.లింగమయ్య, గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతులయ్య తదితరులున్నారు.

రేపటి నుంచి 'గౌరవ్ దివస్'

అనంతపురం రూరల్: బిర్సా ముండా జయంతి సందర్భంగా ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు జన్ జాతీయ గౌరవ్ దివస్ ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజినేయులు ప్రకటన విడుదల చేశారు.

అనధికార డిప్యుటేషన్ రద్దు చేయాలి

అనంతపురం మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో అనధికారికంగా డిప్యుటేషన్ విధులు నిర్వర్తిస్తున్న వారిని తక్షణం వారి స్థానాల్లో పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోదండ రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాతకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఖరీఫ్ పంటలపై అప్రమత్తంగా ఉండండి

రాప్తాడురూరల్: ఖరీఫ్‌లో సాగు చేసిన కంది, ఇతరత్రా పంటలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని అనంతపురం రూరల్ మండల వ్యవసాయాధికారిణి శశికళ సూచించారు. బుధవారం అనంతపురం రూరల్ మండలం కామారుపల్లి, గొల్లపల్లి గ్రామాల రైతు సేవా కేంద్రంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. మైక్రో ఇరిగేషన్ అధికారిణి హరిత, వ్యవసాయ విస్తరణాధికారి మురళీకృష్ణ, అనుపమ, రైతులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముద్దాయికి జైలు

బుక్కరాయసముద్రం/అనంతపురం: చోరీ కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ అనంతపురం మొబైల్ కోర్టు న్యాయమూర్తి సుజిన్‌కుమార్ తీర్పు వెలువరించారు. సీఐ కరుణాకర్ తెలిపిన మేరకు... బీకేఎస్ మండలం బాటలో కొత్తపల్లి గ్రామంలోని రెండు ఇళ్లల్లో గత ఏడాది ఆగస్టు 9న చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో నార్పల మండలం చింతవనం కొట్టాలకు చెందిన బుస్సే సుభాష్‌ను అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి సుజిన్ కుమార్ తీర్పు వెలువరించారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు

అనంతపురం క్రైం: ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు సీడాప్ ఆధ్వర్యంలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య తెలిపారు. ఫ్యూజన్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో రిలేషన్ ఆఫీసరు పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, ఆపై చదువులు పూర్తి చేసి, 19 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులన్నారు. ఈ నెల 15న ఉదయం పది గంటలకు అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు.

పోస్టర్ల విడుదల

అనంతపురం అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా గురువారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు జరగనున్న అఖిల భారత 71వ సహకార వారోత్సవాల పోస్టర్లను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి (డీసీవో) ఇ.అరుణకుమారి, డీఎల్‌సీవో ఎం.ప్రభాకరరెడ్డి, ఎస్‌డీఎల్‌సీవో జీకే బాలగంగాధర్, సహకార విద్యాధికారి మురళీమోహన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. రమ తెలిపారు. ఈ నెల 20న ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

పని చేసే చోట మహిళల బాధ్యత యాజమాన్యాలదే

అనంతపురం: మహిళలు పనిచేసే చోట ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ఆయా యాజమాన్యాలపై ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. శివప్రసాద్ యాదవ్ తెలిపారు. కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక (పోష్) చట్టం –2013పై జిల్లా న్యాయసేవా సదన్‌లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్, జడ్జి కే. శ్రీనివాస రావు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీఎన్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యా కార్యక్రమాలపై దృష్టి పెట్టండి

అనంతపురం అర్బన్: విద్యా కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ డీఈఓ ప్రసాద్‌బాబుకు సూచించారు. జేసీని బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో డీఈఓ మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, మానవతా చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత, ఎన్ఎస్ఎస్ అధికారిణి ఫాతిమున్నీషా తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

అనంతపురం ఎడ్యుకేషన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నలంద డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించింది. మొత్తం 57 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పీవీ ప్రతాపరెడ్డి, నలంద డిగ్రీ కళాశాల ప్రతినిధులు కేబీ చౌదరి, భువనేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోండి

అనంతపురం అగ్రికల్చర్: వివిధ కారణాలతో తొలగించిన తమను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ (ఎంపీఈవోలు) పలువురు బుధవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మను కోరారు. ఆర్‌ఎస్‌కే రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టిన నేపథ్యంలో తమకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిత

అనంతపురం రూరల్: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పీవీకేకే పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మునికృష్ణారెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో వృక్షశాస్త్రం మొదటి సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు పుల్లన్న, నర్మద పాల్గొన్నారు.

జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సస్పెన్షన్

అనంతపురం: జిల్లా క్రీడాభివృద్ధి అధికారి షేక్ షఫీని సస్పెండ్ చేస్తూ శాప్ మేనేజింగ్ డైరెక్టర్ పీఎస్ గిరీష ఆదేశాలు జారీ చేశారు. షఫీపై వచ్చిన ఆరోపణలపై విచారించేందుకు విచారణాధికారిని నియమించాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లా క్రీడాభివృద్ధి శాఖ కార్యాలయంలో రూ.18 లక్షల విలువ చేసే జనరేటర్ కనిపించకుండా పోయింది. జనరేటర్‌ను దొంగచాటుగా అమ్మేశారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం

అనంతపురం సెంట్రల్: రాష్ట్రంలో రైతాంగం, ప్రాజెక్టుల సమస్యలను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జల ఈశ్వరయ్య మండిపడ్డారు. బుధవారం నగరంలో జీఎంఆర్ కన్వెన్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో పెంచాలని నాయకులు తీర్మానించారు. జనవరిలో కడపలో రైతు సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. రాయలసీమ జిల్లాల అధ్యక్ష,కార్యదర్శులు చిన్నప్పయాదవ్, బెల్లం మహాదేవ, భాస్కర్‌రెడ్డి, కమతం కాటమయ్య తదితరులున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

GNM (నర్సింగ్) అడ్మిషన్స్

■ On-Line Last Date: Nov-20th ఇంటర్ Any గ్రూప్ పాస్ స్టూడెంట్స్ కి GNM నందు గవర్నమెంట్ సీట్స్ కలవు. ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర : జి.మురళి, 9030661651, అనంతపురము. [A-1405]

REAL ESTATE

బాడుగకు

■ అనంతపురం సిటీ నందు నేషనల్ పార్క్ శిల్పారామం వద్ద, N.H. హైవే దగ్గర, Skyadobe టవర్స్‌లో B-001, 2BHK ఫ్లాట్ బాడుగకు ఇవ్వబడును. సెల్: 9505555016 [A-364]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6600]



WANTED

■ అనంతపురంలోని శ్రీ మాస్టర్స్ జూనియర్ కళాశాల (భైరవనగర్) యందు పనిచేయుటకు మెస్ హెల్పర్ మరియు అటెండర్ (స్త్రీలు) వెంటనే కావలెను. సెల్ : 8919471814. [A-1404]

■ సోలార్ కంపెనీలో 2 సంవత్సరాల అనుభవం ఉన్న సేల్స్ ప్రొఫెషనల్స్ కోసం అవకాశాలు; శాలరీ : రూ. 10,000 నుండి రూ. 15,000. ఆసక్తి ఉన్నవారు సంప్ర : 8121766831. [A-1406]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1253915]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ ప్రతి రోజు 500 పేమెంట్. వాట్సాప్‌లో Hi అని మేసేజ్‌చేసి వివరాలకు కాల్ చేయండి. 8247808801. [M-1185422]

■ ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ నందు పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ (పు), బైక్ ఉండవలెను. టెలికాలర్ (స్త్రీ) కంప్యూటర్ నాలెడ్జ్ కావలెను. కర్నూలు & నంద్యాల వాస్తవ్యులకు 6305919795 [Y-798490]

■ ప్రముఖ టోల్‌ప్లాజా నందు పనికి 10th - PG అర్హతగల కంప్యూటర్ ఆపరేటర్ & క్యాషియర్ కావలెను. 8 గం॥ డ్యూటీ. భోజనం + వసతి. ఆకర్షణీయ జీతం.Loc:అనంతపురం. 70136 43462. [NA-3017]

■ అనంతపురం నగరంలోని మా సంస్థ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గంటల డ్యూటీ, జీతం: 12,000+ESI,PF సంప్రదించండి: 72879 17477 [L-796398]

■ ప్రముఖ షాపింగ్ మాల్స్ మరియు సినిమా థియేటర్లలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (M/F) కావలెను. సంప్రదించండి: 7036790791, 9573371377, 8008869176. [SCA24000623]

■ అనంతపురము, కడప, కర్నూలు జిల్లాల్లో కిసాన్ మిత్ర ప్రోగ్రామ్ నందు ఫీల్డ్ వర్క్ చేయడానికి 10th, ఇంటర్, డిగ్రీ చదివిన స్త్రీ / పురుష అభ్యర్థులు కావలెను. ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్: జీతం: 16 వేలు. & డిస్ట్రిక్ట్ మేనేజర్: జీతం: 25 వేలు. 9885417885, 8341890291, 9000501816. [A-762476]

■ న్యూస్ ఛానెల్ నందు అనుభవం ఉన్నవారు పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మరియు అన్ని నియోజకవర్గాల వారీగా రిపోర్టర్స్, కెమెరామెన్, యాంకర్స్, యాడ్స్ మేనేజర్ కావలెను. A.P. ఇంచార్జ్, సెల్ : 9676842307. [A-1403]

■ బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూం అనంతపురం, గుత్తి, ధర్మవరంలో ఆఫీస్ బాయ్స్, ప్యాకింగ్ హెల్పర్, వెయిట్ లిఫ్టింగ్, ఫీల్డ్ మేనేజర్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: PF,ESI, 4 Wo కలదు. ✆ 9989139239, 8179196300 [T-1235151]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9160900024, 9640400073 [SCA24000627]

■ మర్చంట్ నేవీలో Cruise Shipsలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు, విభాగం అన్ని డిపార్టుమెంట్స్ వ: 18–27, Qly: 10th & అబోవ్, లాయిడ్స్ మ్యారిన్ సర్వీసెస్ Pvt. Ltd, Hyd, T.G., కోయంబత్తూర్ (TN) Ph: 7675982065 [SCA24000632]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.